


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 18-05-2022 సంపుటి : 03 సంచిక : 240 పేజీలు : 4 వెల : రూ 3-00


## కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్.. ప్రధాని మోదీ సందేశం



న్యూఢిల్లీ: సినిమాలు నిర్మిస్తున్న దేశాల్లో ఇండియా అతిపెద్ద దేశమని ప్రధాని అన్నారు. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ నేపథ్యంలో ఆయన ఇవాళ ప్రత్యేక సందేశం రిలీజ్ చేశారు. సినిమాలు, సమాజం ఒకటికి ఒకటి ప్రతిబింబాలన్నారు. మానవ భావోద్వేగాలను సినిమాలు కళాత్మకంగా చూపిస్తాయని, ఎంటర్‌టైన్మెంట్ ద్వారా ప్రపంచాన్ని ఏకం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు. ఇండియాలో భిన్నమైన భాషల్లో వివిధ ప్రాంతాల వారు సినిమాలు తీస్తున్నారని, ఇది అసాధారణమని ప్రధాని తెలిపారు. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సారి ప్రఖ్యాత డైరెక్టర్ సత్యజిత్ రే తీసిన సినిమాను స్క్రీనింగ్ చేయడం గొప్ప విషయం అన్నారు. తాజా ఎడిషన్ ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇండియాలోని అనేక స్టార్టప్‌లు ప్రపంచ సినిమాకు తమ సత్తా చాటనున్నట్లు ఆయన చెప్పారు. కేన్స్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ పెవిలియన్‌ను రేపు ఆవిష్కరించనున్నారు. భారత సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈసారి కేన్స్ ఫెస్టివల్‌లో ఆరు భారతీయ చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ చిత్రాలను అఫిషియల్ స్క్రీనింగ్ జాబితాలో లేవు. కానీ వీటిని కేన్స్ ఫిల్మ్ మార్కెట్‌లో ప్రదర్శించనున్నారు. ఇందులో అన్నీ ప్రాంతీయ చిత్రాలే ఉంటాయి. ఆ జాబితాలో రాకెట్రీ ద నంబీ ఎఫెక్ట్, గోదావరి, దుయిన్, ఆల్ఫా బీటా గామా, బూంబా రైడ్, నిరయి తాతకుల్ల మారమ్ చిత్రాలు ఉన్నాయి.

## సీమసిగలో మెగా పవర్ ప్రాజెక్ట్..



కర్నూలు ప్రపంచంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళశారం శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ.. కర్నూలులో హైడల్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం సంతోషం. ప్రపంచంలోనే తొలి హైడల్ పవర్ ప్లాంట్‌కు కర్నూలు వేదికవడం గర్వకారణమని సీఎం జగన్ అన్నారు.'ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కోసం గ్రీన్‌కో ఎనర్జీస్

<u>సీఎం జగన్ చేతులమీదుగా శంకుస్థాపన</u>

<u>ఇది గర్వించదగిన విషయం: సీఎం జగన్</u>



ప్రైవేట్ లిమిటెడ్ రూ.15 వేల కోట్ల పెట్టుబడి పెట్టబోతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని నిరుద్యోగులకు భారీగా ఉపాధి, ఉద్యోగావకాశాలు రానున్నాయి. హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 15 వేల ఉద్యోగాలొస్తాయి. ఐదేళ్ల పాటు నిర్మాణ పనులు కొనసాగుతాయి. తరువాత ప్రత్యక్షంగా 3 వేల మందికి.. పరోక్షంగా మరో 5 వేల మంది ఉపాధి పొందుతారు' అని సీఎం జగన్ అన్నారు.మొత్తం 5,410 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నేషనల్ గ్రిడ్‌కు అనుసంధానించి ఓరక్వల్లు పీజీసీఐఎల్/ సీటీయూ విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా దేశంలోని డిస్కామ్‌లు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని రాబోయే 5 ఏళ్లలో పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తారు. రూ.15 వేల కోట్ల పెట్టుబడితో స్థాపించే ఈ పవర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకుంటే 23 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల లభిస్తాయి. అంతేకాక స్థానికంగా ఉన్న పరిశ్రమలు, హోటళ్లలో విద్యుత్ కోతలకు చెక్ పెట్టవచ్చు. గ్రీన్‌కో ఎనర్జీస్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే అత్యధికంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 4,766.28 ఎకరాల భూమిని కేటాయించింది. ఇప్పటికే 2,800 ఎకరాలను కంపెనీకి అప్పగించింది. ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులో భాగంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి 3000 మెగావాట్లు, విండ్ 550 మెగావాట్లు, హైడల్ పవర్ 1860 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుకు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుమ్మితం తాండాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంకురార్పణ చేశారు. అంతకు ముందు అక్కడ ఏర్పాటు చేసిన ఓ పైలాన్‌ను సీఎం జగన్ ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓర్వకల్లు మండలం గుమ్మితం తాండాలో పవర్ ప్రాజెక్ట్ త్రీడీ మోడల్ నమూనాను ప్రారంభించారు. ఒకే యూనిట్ నుంచి సోలార్, విండ్, హైడల్ పవర్లను ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. ఈ ప్రాజెక్ట్ ద్వారా 5,230 మెగావాట్ల ఉత్పత్తి చేస్తారు.

## ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థుల ఖరారు



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు అయ్యారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్లను ఖరారు చేశారు. విజయసాయిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్‌రావులను రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించారు. తొలుత ఈ నలుగురు సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. భేటీ అనంతరం ఈ నలుగురి పేర్లను అధికారికంగా మంత్రి బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు.అందరితో సంప్రదించిన తర్వాతే నలుగురి పేర్లను ఖరారు చేసినట్లు బొత్స, సజ్జల మీడియాకు తెలిపారు. విజయసాయిరెడ్డిని మరోసారి రాజ్యసభకు పంపాలని నిర్ణయించినట్లు బొత్స వెల్లడించారు. అలాగే జాతీయ బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్య, మరో బీసీ నాయకుడు బీద మస్తాన్‌రావు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డిలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.నలుగురు రాజ్యసభ అభ్యర్థుల్లో ఇద్దరు బీసీలేనని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రత్యక్ష పోస్టులైనా, నామినేటెడ్ పోస్టులైనా వైఎస్సార్‌సీపీది ఒకటే దారి అని, జనాభా దామాషాకు తగ్గట్టుగా బడుగు, బలహీన వర్గాలకు పదవులు ఇస్తున్నామన్నారు సజ్జల. గత మూడేళ్లలో భర్తీ చేసిన అన్ని పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధిని వైఎస్సార్‌సీపీ ఎప్పటికప్పుడు నిరూపించుకుంటోందని సజ్జల తెలిపారు.

### రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసిన వైసీపీ? ఆర్. కృష్ణయ్యకు ఛాన్స్

ఏపీలో రాజ్యసభ అభ్యర్థులను అధికార వైసీపీ ఖరారు చేసింది. నలుగురి పేర్లను ఖరారు ఏపీ సీఎం జగన్ ఖరారు చేశారు. విజయసాయి రెడ్డి, ఆర్. కృష్ణయ్య, నిరంజన్ రెడ్డి, బీద మస్తాన్ రావు పేర్లను సీఎం జగన్ ఖరారు చేశారు. ఈ విషయాన్ని ఏపీ విద్యా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు.ఇప్పటికే రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్న విజయసాయి రెడ్డికి సీఎం జగన్ మరోసారి ఛాన్స్ ఇచ్చినట్లైంది. ఇక బీసీ నేత ఆర్. కృష్ణయ్యకు అనూహ్యంగా ఛాన్స్ ఇచ్చారు. దీంతో ఆర్. కృష్ణయ్య ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇక సుప్రీంకోర్టు న్యాయవాదిగా ఉన్న నిరంజన్ రెడ్డిని రాజ్యసభకు పంపనున్నారు.బలహీన వర్గాలకు సముచిత స్థానం ఇవ్వాలన్నదే తమ పార్టీ అభిమతమని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ నేపథ్యంలోనే బలహీన వర్గాలను రాజ్యసభకు పంపుతున్నామని తెలిపారు. గత రాజ్యసభ ఎన్నికల సమయంలోనూ బలహీన వర్గాలకు చెందిన పిల్లి సుభాస్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ గారిని పంపామని గుర్తు చేశారు. రాజ్యసభ ఎన్నికలనేవి దేశం మొత్తానికి సంబంధించిన ఎన్నికలని, తెలంగాణ, ఆంధ్రా అంటూ వుండవని అన్నారు. బీసీల తరపున ఆర్. కృష్ణయ్య జాతీయ స్థాయిలో ఎప్పటి నుంచో ఉద్యమాలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు.



## ఆర్. కృష్ణయ్యను ఎందుకు ఎంపిక చేశారో చెప్పిన ఏపీ సలహాదారు సజ్జల



బలహీన వర్గాలకు పెద్దపీట అన్నది వైసీపీ విధానమని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఇదేదో డొల్ల విధానం కాదని, గత ప్రభుత్వాలు చేసిన మాదిరి కాదని ఎద్దేవా చేశారు. ఏపీ తరపున నలుగురు రాజ్యసభ సభ్యులను ఖరారు చేసిన తర్వాత సజ్జల మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో కూడా ఇలా జరగలేదని, ఇదో అరుదైన ఘట్టమని చెప్పుకొచ్చారు.మొత్తం నలుగురు రాజ్యసభ అభ్యర్థులను నామినేట్ చేయగా.. అందులో ఇద్దరు బీసీలని సజ్జల అన్నారు. గత రాజ్యసభ ఎన్నికల్లోనూ తాము బీసీలకు ఛాన్స్ ఇచ్చామని, ఒకరు మోపిదేవి రమణ, మరొకరు పిల్లి సుభాస్ చంద్రబోస్ అని గుర్తు చేశారు. ఇలా ఇద్దరు బీసీలకు ఛాన్స్ ఇవ్వడం ద్వారా.. సీఎం జగన్ మనసులో బీసీలకు ఎంత స్థానం వుందో అర్థమవుతుందన్నారు. బహుశః బీసీ ముఖ్యమంత్రి ఉన్నా.. ఇలా జరిగేది కాదేమోనని సజ్జల అన్నారు.ఆర్. కృష్ణయ్య బీసీలకు ఓ సింబల్ అని సజ్జల అభివర్ణించారు. బీసీ కులాలన్నింటినీ ఆయన ఏకతాటిపైకి తెచ్చారని, బీసీల కోసం నిలబడ్డారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో బీసీల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని, అలాంటి వారిని రాజ్యసభకు పంపి, అక్కడ వాయిస్ వినిపిస్తే బాగుంటుందన్న దృక్పథంతోనే ఆర్. కృష్ణయ్యను ఎంపిక చేశామని సజ్జల వివరించారు.ఏపీ రాజ్యసభ అభ్యర్థులను ఏపీ సీఎం జగన్ ఖరారు చేశారు. ఈ విషయాన్ని ఏపీ విద్యా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న విజయసాయి రెడ్డికి మరోసారి సీఎం జగన్ ఛాన్స్ ఇచ్చారు. ఇక? ఆర్. కృష్ణయ్య, నిరంజన్ రెడ్డి, బీద మస్తాన్ రావును రాజ్యసభ అభ్యర్థులుగా ఖరారు చేశారని బొత్స వెల్లడించారు.

## పోలవరం ప్రాజెక్ట్ డిజైన్ల ఖరారుపై కేంద్ర జల్‌శక్తి శాఖ సమావేశం



న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్ట్ డిజైన్ల ఖరారుపై మంగళవారం మధ్యాహ్నం.3 గంటలకు జల్‌శక్తి శాఖలో సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర జల్‌శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం నేతృత్వంలో ఈ భేటీ జరగనుంది. నిధుల మంజూరుపై రేపు ఆ శాఖ కార్యదర్శి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయనున్నారు. గోదావరి వరద ఉధృతికి పోలవరం ప్రధాన డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణ ప్రాంతంలో కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చటం, కొంత భాగం దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను పటిష్ఠం చేయడంపై చర్చించేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ), పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారులతోపాటు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఈనెల 11న సీడబ్ల్యూసీ డైరెక్టర్ ఖయ్యూం అహ్మద్ నేతృత్వంలోని అధికారుల బృందం పోలవరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధ్యయనం చేసింది.

## క్షేత్రస్థాయి కమిటీలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



అమరావతి: క్షేత్రస్థాయి కమిటీలతో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. బాదుడే బాదుడు, మెంబర్‌షిప్, ఓటర్ వెరిఫికేషన్, మహానాడుపై సమీక్ష నిర్వహించారు. కష్టాల్లో ఉన్న రాష్ట్ర ప్రజలకు టీడీపీ ఇప్పుడు ఒక హోప్‌గా కనిపిస్తుందన్నారు. గ్రామాల్లో టీడీపీకి స్వాగతాలు... గడపగడపలో వైసీపీ నేతలకు నిలదీతలే అందుకు నిదర్శనమని చంద్రబాబు అన్నారు. జగన్ పథకాలు బూటకమేనని ప్రజలకు అర్థమౌతుందన్నారు. అన్ని గమనించే జగన్ ముందస్తుకు వెళ్లాలని భావిస్తున్నారని చెప్పారు. ముందస్తు ఎన్నికలు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. అన్నివర్గాల్లో ప్రభుతంపై వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ప్రభుత్వాన్ని ఎంతోకాలం నడపలేమని సీఎంకు అర్థమైందన్నారు. అందుకే ముందస్తు ఎన్నికలు వెళ్లాలని జగన్ భావిస్తున్నారని వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే దాడులా?: నారా లోకేష్

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేవారిపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మేనమామ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అవినీతిని బట్టబయలు చేస్తోన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయినాథ్‌శర్మ కారు ధ్వంసం చేసి, చంపేస్తామని వార్నింగ్ ఇవ్వడం దారుణమన్నారు. రౌడీ రాజకీయ నాయకులకు ఎవరూ భయపడరని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులంతా సాయినాథ్ శర్మకి అండగా ఉంటుందన్నారు. సమావేశాల్లో జగన్‌రెడ్డిని చూసి జనం పారిపోతుండడంతో.. జగన్‌రెడ్డి, ఆయన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. వైసీపీ నాయకుల మాటలు బూటకమని ప్రజలు గుర్తిస్తున్నారని లోకేష్ పేర్కొన్నారు.



### ఏపీలో 15 మంది ఐపీఎస్ ఆఫీసర్ల బదిలీలు, తక్షణమే అమలులోకి..

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పదిహేను మంది ఐపీఎస్ ఆఫీసర్ల బదిలీ ప్రక్రియ జరిగింది. మంగళవారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ పేరు మీదుగా ప్రభుత్వ జీవో విడుదల అయ్యింది. ఎల్‌కేవీ రంగారావు, ఎస్వీ రాజశేఖర బాబు, పీహెచ్‌డీ రామకృష్ణ, కేవీ మోహన్ రావు, ఎస్ హరికృష్ణ, గోపినాథ్ జట్టి, కోయ ప్రవీణ్, విశాల్ గున్నీ, రవీంద్ర బాబు, అజిత వెజెండ్ల, జీ కృష్ణకాంత్, పీ జగదీశ్, తుహిన్ సిన్హా, బిందు మాధవ్ గరికపాటి, పీవీ రవికుమార్ బదిలీ జాబితాలో ఉన్నారు. విజయవాడ రైల్వే ఎస్పీగా విశాల్ గున్నీకి అదనపు బాధ్యతలు అప్పగించగా, శాంతి భద్రతల డీఐజీగా రాజశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కోస్టల్ సెక్యూరిటీ డీఐజీగా ఎస్ హరికృష్ణకు, న్యాయవ్యవహారాల ఐజీపీగా గోపీనాథ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

# సంపాదకీయం

బుధవారం 18-05-2022

## పేదరికంలో బాల్యం....

2020 యునిసె ఫ్, సేవ్ ది చిల్డ్రన్ సంస్థల నివేదికలు ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 1.2 బిలియన్ల పిల్లలు కడు పేదరికంలో మగ్గుతున్నట్లు తెలిపారు. ఈ కరోనా కాలంలో అల్పాదాయ, మధ్య ఆదాయ దేశాల్లో ఈ సంఖ్య మరి 15% పెరిగి మరో 150 మిలియన్ల చిన్నారులు ఈ బహుముఖీన పేదరికంలో జారుకున్నారు. ప్రస్తుతం మరో 10% మంది చిన్నారులు పెరిగి, ప్రపంచ వ్యాప్తంగా బాలలు కడు పేదరికంలో ముఖ్యంగా తినడానికి తిండి, కట్టుకోవడానికి దుస్తులు, ఉండటానికి నివాసం లేక అలమటిస్తున్నారు.పలు దేశాల్లో రాజకీయ అస్థిరత్వం, ధరలు పెరగడం, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం కారణాలు అయితే, మరో పక్క కరోనా కాలంలో లాక్డౌన్, కర్ఫ్యూలు, ఇంకా ఈ వైరస్ మన వెంటే ఉండడం వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం, పరిశ్రమలు మూతపడంతో ఈ పేదరికం విష వృక్షం కోరల్లో కొన్ని కోట్ల మంది చిక్కుకుని తీవ్ర దుర్భిక్షం ఎదుర్కొంటూ, అత్యంత దయనీయ స్థితిలో ఉండుట బాధాకరం. అంతర్జాతీయ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వీరి కనీస అవసరాలు తీర్చడానికి చేయూత నివ్వాలి. ఈ పరిస్థితులు చాలవు అన్నట్లు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, శ్రీలంక ఆర్థిక సంక్షోభం, అఫ్ఘానిస్తాన్‌లో తాలిబాన్ పాలన, మయన్మార్‌లో సైనిక పాలన, పాకిస్తాన్‌లో రాజకీయ పరిణామా లు, సిరియా శరణార్థులు ఇటువంటి పరిస్థితు ల్లో ముఖ్యంగా ఈ ఆసియా దేశాలు, అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో ప్రజలు, చిన్నారులు చరిత్రలో ఎన్నడూలేని విధంగా కడు పేదరికంలోకి బలవంతంగా నెట్టివేయబ డుతున్నారు.ప్రతి అల్పాదాయ వర్గాల వారికి, ప్రజలకు ఆహారం, దుస్తులు, విద్య, వైద్యం, ఆవాసం, పోషకాహారం అందడం జరగాలి. ఈ కనీస సౌకర్యాలు / అవసరాలు లేకపోవడమే మల్టీ డైమెన్షనల్ పేదరికం అని పేర్కొంటారు. సుమారు 45% పిల్లలు ప్రపంచ వ్యాప్తంగా ఈ సౌకర్యాలు లేకుండా ఉ న్నారు అని యునిసెఫ్ నివేదిక చెబుతోంది. ఈ కరోనా కాలంలో చాలా దేశాల్లో కర్ఫ్యూలు, లాక్‌డౌన్ల వలన పరిశ్రమలు మూతపడ్డాయి. ఉ ద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయి లక్షలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. 'యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెన్రిట్టా ఫోర్' మాట్లాడుతూ 'చాలా కుటుంబాలు కడు పేదరికంలో జారుకు న్నాయని, కొవిడ్ ప్రారంభ సమయం కంటే ముగింపు దినాలు మరింత దుర్భరమైన జీవితాన్ని ఇచ్చింది' అని తెలిపారు. పేద కుటుంబాల్లో చిన్న పిల్లలే సంపాదించే మార్గంగా ఉంటున్నారు అనేది జగమెరిగిన సత్యం. పని లేకపోవడం వల్ల, తిండి లేక పోషకాహార లోపంతో అనారోగ్యాలకు గురవుతున్నారు. చదువుకు దూరం అవు తున్నారు. విద్యాసంస్థలు మూతపడ్డాయి. బాల్య వివాహాలు పెరిగాయి. ఇటువంటి పరిస్థితుల్లో పరిశ్రమలు, ఆర్థిక కార్యకలా పాలు పునఃప్రారంభం చేయడానికి అన్ని దేశాలు సత్వరం చర్యలు చేపట్టాలి. ఉపాధి కల్పన ద్వారానే కనీస అవసరాలు తీరుతాయి. ఆరోగ్యం బాగు పడుతుంది. ప్రభుత్వాలు పనిచేసే వారికి పెయిడ్ లీవ్, చైల్డ్ కేర్ పాలసీలు అమలు చేయాలి. సేవ్ ది చిల్డ్రన్ సిఇఒ ఇంజర్ ఆషింగ్ మాట్లాడుతూ 'కరోనా పిల్లలను విద్యకు దూరం చేసింది. దారిద్ర్యం మరింత రెట్టింపు చేసింది' అని తెలిపారు. బాల కార్మికులు పెరగడం జరిగింది. ప్రపంచాన్ని మరో రెండు దశాబ్దాల వెనక్కి తీసుకుని వెళ్ళింది. ప్రపంచ సంస్థలు, వివిధ దేశాల ప్రభుత్వాలు వీరి భవిష్యత్తుకు ప్రణాళికలు రచించాలి. ఇప్పటికే 15% పేదరికం పెరిగిందని ఆందోళన వ్యక్తం అవుతోంది.ఒక పక్క కరోనా, ప్రకృతి విపత్తులు వలన అల్ప మధ్య ఆదాయ ప్రజలు, దేశాలు కూనారిల్లుతుండగా, మరోపక్క మానవ తప్పిదాలతో మరెందరో పేదరికం బారిన పడుతున్నారు. గత సంవత్సరం ఆగస్టు నెలలో తాలిబన్లు అఫ్ఘానిస్తాన్‌లో పాలన చేపట్టిన తర్వాత సుమారు 3.4 మిలియన్ల మంది అఫ్ఘన్ ప్రజలు ఇతర దేశాలకు శరణార్థులుగా వెళ్ళిపోయారు అని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ (యుయన్‌హెచ్‌సిఆర్) తెలిపారు. వీరిలో ఎక్కువ మంది ఇరాన్, పాకిస్థాన్ దేశాలకు 2 మిలియన్ల మంది శరణార్థులుగా వెళ్లారు. తాలిబాన్లు పాలన వల్ల ప్రపంచంలోని అత్యంత దయనీయ స్థితికి అఫ్ఘానిస్తాన్ చేరింది అని వరల్డ్ బ్యాంక్ తెలిపింది. ఆర్థిక, సామాజిక, అంతరాలు లింగ వివక్షతో కూనారిల్లుతుంది. 1979 నుంచే ఈ అఫ్ఘాని స్తాన్ నుండి వలసలు ప్రారంభమ య్యాయి అని చరిత్ర చెబుతోంది. 37% కుటుంబాలు సరైన సంపాదన లేక, 33% శాతం జనాభా కొనుగోలు శక్తి లేక ఆహార లేమితో బాధపడుతున్న దయనీయ స్థితి, ఆఫ్ఘానిస్తాన్ జిడిపి 34% తగ్గింది. ఇక శ్రీలంక ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయి, తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఇక్కడ ప్రజలు వలసలు బాటపట్టారు. భారత్‌లోకి వస్తున్నారు. మన సరిహద్దు దేశం పాకిస్తాన్ రాజకీయ అస్థిరత్వంతో, అప్పులు బాధతో రోజు రోజుకు దిగజారుతుంది. ఇటీవల యుద్ధం కారణంగా, ఏప్రిల్ 25 తేదీ నివేదిక ప్రకారం ఉక్రెయిన్ నుంచి సుమారు 12 మిలియన్ల మంది స్థానభ్రంశం చెందారు. వీరిలో పోలెండ్ దేశానికి 29,09,415 మంది, రొమేనియాకు 7,77,602, రష్యా కు 6,05,815 మంది, హంగేరికి 4,92,976, మాల్డోవాకు 4,43,895 మంది, స్లోవేకియా కు 3,55,593 మంది, బెలారస్ కు 24,477 మంది శరణార్థులుగా వెళ్లారని ఐక్యరాజ్య సమితి, ఐఒయం తెలిపింది. ఈ విధంగా కరోనా, ప్రకృతి వైపరిత్యాలు వలన, మరో పక్క రాజకీయ, ఆర్థిక, యుద్ధ కారణాలు వలన ప్రపంచంలోని అనేక అల్ప మధ్య ఆదాయ ప్రజలు, బాలలు కడు పేదరికం, దుర్భరమైన జీవితాన్ని చవిచూ స్తున్నారు. మానవ హక్కులు లేని జీవితాలు పట్ల పలు అంతర్జాతీయ సంస్థలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.మహిళలు, చిన్నారుల కోసం రక్షణ భద్రత చర్యలు చేపట్టాలి. ఏదిఏమైనా ప్రపంచ దేశాలు వారి దేశాల్లో రాజకీయ సుస్థిరతకు పెద్ద పీట వేయాలి. ఉగ్రవాద నిర్మూలనకు చర్యలు చేపట్టాలి. మతమౌఢ్యం అన్ని దేశాలూ విడనాడాలి. ఉచితాలు, విపరీతంగా ఓట్లు సీట్లు కోసం ప్రజా కర్షక పథకాలు అమలు చేయరాదు. దేశాలు, రాష్ట్రాలు అప్పులు ఊబిలో కూరుకుపోకూడ దు. విద్య, వైద్యం ప్రభుత్వం ఆధీనంలో ఉండాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. స్వయం సమృద్ధి దిశగా 'లోకల్ టు గ్లోబల్' వైపు ప్రయాణం చేయాలి. ఎగుమతులు పెంచుకుని, దిగుమతులు తగ్గించుకోవాలి. ఈ విధంగా ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేసుకుంటూ చైనా, దక్షిణ కొరియావలే అన్ని దేశాలు స్వయం సమృద్ధి సాధించి ఆయా దేశాల ప్రజల అన్ని రకాల సుస్థిర అభివృద్ధి (సస్టెయండ్ డెవలప్‌మెంట్) కి, మానవ అభివృద్ధి సూచికలో మెరుగైన స్థితిలో ఉండుటకు ఇకనైనా ప్రయత్నాలు ముమ్మరం చేయాలి.

## స్వయం ఆంధ్రా పేరుతో బ్రాండింగ్

విజయవాడ, మే 17, సముద్ర ఆధారిత వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం కొత్త పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో పాటు లాజిస్టిక్స్, ఎగుమతులను ప్రోత్సహించేలా నూతన పాలసీలను తెస్తోంది. 2020?21లో రూ.1.24 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర వాణిజ్య ఎగుమతులను వచ్చే ఐదేళ్లలో రూ.3.50 లక్షల కోట్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం ఏపీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ పాలసీ ?2022 ? 27 రూపొందించింది. ఈ ముసాయిదా పాలసీకి రాష్ట్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది.ఎగుమతులను రెట్టింపు చేసేలా 'పుష్' విధానాన్ని అమలు చేయనున్నట్లు ముసాయిదా పాలసీలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉ త్పత్తులకు మరింత విలువను జోడించడం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించనున్నారు(ప్రమోట్?పీ). ఇందుకోసం జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎగుమతి ప్రోత్సాహక వ్యవస్థలను అభివృద్ధి చేస్తారు. ఎగుమతులకు కీలకమైన ఓడ రేవులు, గోడౌన్లు, కోల్డ్ స్టోరేజ్‌లతో పాటు మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు లాంటి కీలక మౌలిక వసతులను అభివృద్ధి (అప్‌గ్రేడ్?యూ) చేయనున్నారు.ఇప్పటికే 4 పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్లతో పాటు విశాఖ, అనంతపురంలో 2 మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. వీటితో పాటు మౌలిక వసతుల కల్పనతో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా పలు ప్రోత్సాహకాలను ముసాయిదాలో ప్రతిపాదించారు. ఎగుమతుల విధానాన్ని స్ట్రీమ్‌లైన్ (ఎస్) చేస్తూ నూతన టెక్నాలజీ వినియోగం ద్వారా (హార్నెస్?హెచ్) ఎగుమతులను ప్రోత్సహించేలా ముసాయిదా పాలసీలో ప్రతిపాదించారు.ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఆరు కీలక అంశాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించనుంది. ఎగుమతుల సమాచారమంతా ఒకేచోట లభించే విధంగా డ్యాష్‌బోర్డు అభివృద్ధి చేయడంతోపాటు టెక్నాలజీని మరింతగా వినియోగించుకోనున్నారు. గిడ్డంగులు, శీతల గిడ్డంగులు, సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు, లాజిస్టిక్ హబ్, ఎయిర్‌పోర్టులు, పోర్టు, రహదారుల అనుసంధానం లాంటి వాటిపై భారీగా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.ప్రతి జిల్లాను ఎక్స్‌పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్ది ఎగుమతి ప్రోత్సాహక కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. నాణ్యతా పరమైన కారణాలతో ఎగుమతులు తిరస్కరణకు గురి కాకుండా క్వాలిటీ టెస్టింగ్ కేంద్రాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంతో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలను కల్పించేలా పాలసీలో పలు ప్రతిపాదనలు పొందుపర్చారు.రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే వస్తువులను అంతర్జాతీయంగా సరఫరా చేసే విధంగా 'స్వయం ఆంధ్రా' పేరుతో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ)ఎగుమతులను ప్రోత్సహించనుంది. కేవలం ఎగుమతుల కోసం ఉత్పత్తి పేరుతో అంతర్జాతీయంగా ప్రచారం కల్పించి నాణ్యత ధ్రువీకరణ సదుపాయాలు కల్పిస్తారు. సర్టిఫికేషన్ చార్జీలపై సబ్సిడీ, మార్కెటింగ్, అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్స్‌లో పాల్గొనే వారికి రాయితీలతో పాటు ఫైనాన్సింగ్, అవార్డులు లాంటి ప్రోత్సాహకాలను పాలసీలో ప్రతిపాదించారు.

?తూర్పు తీరంలో 974 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం కలిగిన ఏకైక రాష్ట్రం

?14 నోటిఫైడ్ పోర్టులు ఉండగా 6 పోర్టుల్లో కార్యకలాపాల నిర్వహణ

?మరో నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులను అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

?2020?21 నాటికి రాష్ట్ర వాణిజ్య ఎగుమతులు రూ.1.24 లక్షల కోట్లు. ఇది దేశ జీడీపీలో 19.14 శాతానికి సమానం

?దేశం మొత్తం ఎగుమతుల్లో రాష్ట్రం వాటా 5.8 శాతం

?దేశీయ ఎగుమతుల సంసిద్ధత ర్యాంకుల్లో 20 నుంచి 9 స్థానానికి ఎగబాకిన ఏపీ

?వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర ఎగుమతులను రూ.3.50 లక్షల కోట్లకు చేర్చడం లక్ష్యం.

## ఎత్తిపోతల పథకానికి సోలార్ విద్యుత్



శ్రీకాకుళం, మే 17, గొట్టా బ్యారేజీ వద్ద నిర్మించతలపెట్టిన ఎత్తిపోతల పథకానికి సోలార్ విద్యుత్ వినియోగించే దిశగా అడుగులు పడుతున్నాయి. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచనల మేరకు ఇక్కడ లిఫ్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనికి ఇంజినీర్లు మరో అడుగు ముందుకేసి సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసే దిశగా ఆలోచన చేస్తున్నారు. జిల్లాలో 2.50 లక్షల హెక్టార్లు ఖరీఫ్, రబీలో పచ్చని పైరుతో మెరవాలంటే హిరమండలం రిజర్వాయర్‌లో 19.05 టీఎంసీల నీటిని నింపాలి.డెడ్‌స్టోరేజ్‌లో 2.5 టీఎంసీల నీరు ఉంది. ఫ్లడ్‌ఫ్లో కెనాల్, కొండ చరియలు నుంచి వచ్చే నీరంతా కలిపి 4టీఎంసీలు ఉంటుంది. మిగిలిన 12 టీఎంసీల నీటిని నింపాలంటే.. ఒకటి నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి నదిలో నీటిని మళ్లించడం, లేక గొట్టాబ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటుచేయడమే మార్గం. అయితే దీనికి వంశధార ఇంజినీర్లు మరో ప్రణాళిక సిద్ధం చేస్తున్నారువంశధార కుడి కాలువ ద్వారా 2800 క్యూసెక్కుల నీటిని మళ్లించేలా కాలువను ఆధునీకరించేందుకు డిజైన్లు చేశారు. పాత కాలువ సామర్థ్యం 1800 క్యూసెక్కులు ఉండగా దాన్ని మరో వెయ్యి క్యూసెక్కులు అదనంగా నీరు పారేలా కాలువను 10 మీటర్లు వెడల్పు పెంచేందుకు డిజైన్ చేస్తున్నారు. కాలువ సామర్థ్యం పెంచి దానిలోంచి ఎత్తిపోసిన నీటిని హిరమండలం రిజర్వాయర్‌లోకి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హిరమండలం రిజర్వాయర్‌లోకి 12 టీఎంసీల నీటిని నింపేందుకు సాధారణంగా విద్యుత్ వినియోగం 45 మెగావాట్స్ అవ్వవచ్చని నిపుణులు అంచనా. అందుకు సుమారు రూ.25కోట్లు విద్యుత్ చార్జీలు అయ్యే అవకాశం ఉంది. అయితే నీటిని ఎత్తిపోయడమనేది వర్షాకాలంలో సుమారు 100 రోజుల్లో పూర్తిచేసే అవకాశం ఉంటుంది. ఎత్తిపోతల అవసరాలు పూర్తయ్యాక మిగిలిన 9 నెలల కాలంలో సోలార్ విద్యుత్‌ని ప్రజా అవసరాలకు పు ష్కలంగా అందించవచ్చు. దాని వల్ల వచ్చే ఆదా యంతో సోలార్‌ప్లాంట్ నిర్మాణ ఖర్చులు, లిఫ్ట్‌కి అయ్యే విద్యుత్ చార్జీలను రాబట్టుకోవచ్చనే ఓ అంచనా వేస్తున్నారు. సోలార్ సిస్టమ్‌ని ఏర్పాటు చేయాలంటే చాలా పెద్ద స్థలం అవసరం. హిరమండలం రిజర్వాయర్ ఫోర్‌షోర్, రిజర్వాయర్ గట్టు ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేయవచ్చు. 45 మెగావాట్స్ విద్యుత్ తయారు చేసేందుకు కావాల్సిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకి సుమారు రూ.300కోట్లు ఖర్చు ఉండవచ్చని అంచనా. అయితే ఏటా ఎత్తిపోతలకు అవసరమైన విద్యుత్ వినియోగించగా మిగిలిన రోజుల్లో వచ్చే విద్యుత్ ద్వారా ప్రభుత్వానికి రూ.40కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్లాంట్ నిర్మాణ ఖర్చు 8 ఏళ్లలో వచ్చేస్తుంది. ప్లాంట్ నిర్మాణం కంటే రైతులకు ఏటా పండించే పంట అంతకు రెట్టింపుగా ఉంటుంది.

## ఆర్టీసీ డ్రైవర్లకు టార్గెట్ పనిష్మెంట్లు.

ఒంగోలు, మే 17, రోగం ఒకటైతే..మందు మరోచోట వేస్తోంది జగన్ సర్కార్. గాయం ఒక చోట తగిలితే..మందు మరో చోట పూస్తోంది. ఇదంతా ఏదో వంకతో కష్ట జీవి జేబు కొట్టేసే కుట్రలో భాగమే. ఇలాంటి కుతంత్రాలు అమలు చేయడంలో జగన్ సర్కార్ ది అందెవేసిన చేయి అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిన జగన్ సర్కార్ రాష్ట్ర అవసరాలకు అప్పులు పుట్టక, బాండ్లు తాకట్టు పెట్టినా దరిద్రం తీరక, కేంద్రం నుంచి సాయం తెచ్చుకోలేక, చివరికి రిటైర్ అయిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వడంలో తాత్సారం చేస్తోంది. ఓడీ సౌకర్యాన్ని మొత్తం వాడేసినా రోజువారీ ఖర్చులకు కటకటలాడే దుస్థితికి దిగజార్చింది. దీంతో ఎక్కడ, ఏ శాఖలో కాసిన్ని డబ్బులున్నా ఎత్తుకుపోయే చర్యలకు ఒడిగట్టింది.ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటిపోయి, దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లు రోజులు వెళ్లదీస్తున్న కింది స్థాయి ఉ ద్యోగుల కష్టార్జితాన్ని కూడా కొట్టేసే కార్యాచరణను జగన్ సర్కార్ అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా ఏపీఎస్సార్టీ డ్రైవర్ల జీతాలకు కోత పెట్టేందుకు సిద్ధమవుతుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది.అదెలాగంటే.. ఆర్టీసీ బస్సు మైలేజ్ తగ్గితే అందుకు దాన్ని నడిపిన డ్రైవరే బాధ్యత వహించాలంట. ఆయా రూట్లలో నిర్దేశించిన మేరకు డీజిల్ వినియోగిస్తే సరేసరి.. అంతకు మించి చుక్క డీజిల్ ఎక్కువ వినియోగం జరిగినా.. దాని ఖర్చు మొత్తం డ్రైవర్ల జీతాల నుంచి కట్ చేస్తారట. ఈ మేరకు ఏపీలోని బస్సు డిపోల మేనేజర్లు డ్రైవర్లకు నోటీసులు ఇవ్వడం కలకలం రేపుతోంది. విశాఖ నగరం పరిధిలోని సింహాచలం బస్సు డిపో మేనేజర్, అనకాపల్లి డిపో మేనేజర్ డ్రైవర్లకు ఇలా నోటీసులు పంపారు. ఆ నోటీసులు అందుకున్న డ్రైవర్లు ఆందోళకు గురవుతున్నారు.మైలేజ్ తగ్గితే జీతం నుంచి రికవరీ చేస్తామంటూ నోటీసులు ఇచ్చిన వారు.. మైలేజ్ తగ్గడానికి గల కారణాలను ఎందుకు పరిశీలించడం లేదని పలువురు డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. ఏపీలో ఒక రూట్ లో ఏప్రిల్ లో నడిచిన ఒక బస్సుకి మైలేజీ లీటర్ కి 6 కిలోమీటర్లకు బదులు 5.16 కిలోమీటర్లే వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు లెక్కలేశారట. దీంతో 115 లీటర్ల డీజిల్ ఎక్కువ వినియోగించినట్లు తేల్చారట. ఆ కారణంగా ఆర్టీసీకి 12 వేల 75 రూపాయలు నష్టం వాటిల్లిందని నిర్ధారించి ఆ మొత్తం నష్టాన్ని సంబంధిత డ్రైవర్ జీతం నుంచి ఎందుకు రికవరీ చేయకూడదో వివరణ ఇవ్వాలని డిపో మేనేజర్



నోటీసు ఇవ్వడంతో డ్రైవర్లలో కూడా ఆందోళన మొదలైంది. ఇదే విధంగా మరో డ్రైవర్ నడిపిన బస్సుకు లీటర్ డీజిల్ 5.20 కిలోమీటర్లకు బదులు 4.65 కిలోమీటర్లే వచ్చిందని తేల్చి అతని జీతం నుంచి 7 వేల 980 రూపాయలు రికవరీ చేయడానికి నోటీసు ఇచ్చారు.నిజానికి ఏపీఎస్సార్టీసీలో కాలం చెల్లిన బస్సులే ఎక్కువగా ఉన్నాయి. దానికి తోడు రాష్ట్రంలో ఎక్కడా రోడ్లు సరిగా ఉన్న పరిస్థితి లేదు. బస్సులు కండిషన్ లో ఉండవు. ఆ డొక్కు బస్సుల నిర్వహణ అనే మాటనే ఎప్పుడూ మర్చిపోయారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కేస్తారు. పులి మీద పుట్ర మాదిరిగా తరచుగా ట్రాఫిక్ అవాంతరాలు ఏర్పడుతుంటాయి. దానికి తోడు గుంతల రోడ్లు. ఇలాంటి వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకోకుండా మైలేజ్ నెపంతో తమ జీతాలకు ఎసరు పెట్టడం ఏంటని డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ఒక బస్సుకు మైలేజ్ తగ్గితే.. ఆ డిపోలో ఉండే సేఫ్టీ డ్రైవింగ్ ఇన్ స్ట్రక్చర్ ను పంపి ఎందుకు మైలేజి తగ్గిందో పరిశీలించాలి. డ్రైవర్ వైపు సమస్య ఉంటే.. జోనల్ ట్రైనింగ్ కాలేజీకి పంపి వారం రోజులు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.ఇలాంటి విషయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా నేరుగా డ్రైవర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని, ఆయా డ్రైవర్ల జీతాలలో కోత పెడతామన్న డిపోల మేనేజర్ల తీరుపై ఆర్టీసీ కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కింది స్థాయిలో జరిగే చిన్న చిన్న తప్పిదాలకు కూడా జీతాల కోత పెట్టేందుకు సిద్ధమయ్యే ఆర్టీసీ అధికారులు పైస్థాయిలో జరిగే అవినీతిపై ఎందుకు ఫోకస్ పెట్టడం లేదని కార్మిక సంఘాలు నిలదీస్తున్నారు

## నీరుగారిపోతున్న ఆరోగ్య శ్రీ

నెల్లూరు, మే 17, జగన్ ఆర్భాటంగా ప్రచారం చేసుకుని, ఆడంబరంగా ప్రారంభించిన పథకాలు ఒకదాని వెనుక ఒకటిగా నీరుగారిపోతున్నాయి. తల్లి దీవెన, అమ్మఒడి, రైతు భరోసా ఇలా ఒక్కటొక్కటిగా పథకాలను నిలిపివేయడమో, వాయిదా వేయడమో షరతులతో లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత వేయడమో చేస్తూ వస్తున్నారు.ఇప్పుడు ఆ కోవలోకి వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం కూడా చేరిపోయింది. మాటలు కోటలు దాటాయి కానీ చేతలు గడప దాటలేదన్నట్లు.. పేద వారి వైద్యం కోసం ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదు.. వెయ్యి రూపాయలు ఖర్చు దాటిన ప్రతి చికిత్సనూ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం కిందకు తీసుకువస్తానంటూ ఘనంగా ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానం ఇప్పుడు గాలి మూటగా మారిపోయింది. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు బకాయిలు పేరుకు పోవడంతో ఆ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ సేవలను బంద్ చేసేశారు.ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల బకాయిలు 600 కోట్లకు పైగా పేరుకుపోవడంతో ఇక ఈ సేవలు అందించలేమంటూ ఆస్పత్రులు చేతులెత్తేశాయి. నాలుగు నెలలుగా ఆరోగ్య శ్రీ బిల్లుల చెల్లింపులు జరగడం లేదు. ఒక్కో నెట్ వర్క్ ఆస్పత్రికి ప్రభుత్వం కోట్ల రూపాయలు బకాయి పడింది. ప్రభుత్వం ఈ సేవల కోసం ఒక్క టంటే ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.అసలు ఎప్పటికైనా చెల్లిస్తారా? చెల్లించేటట్లయితే ఎప్పటికి చెల్లిస్తారు అన్న ప్రశ్నలకు ఆరోగ్య శ్రీ ట్రస్ట్ వద్ద కానీ, సర్కార్ వద్ద కానీ సమాధానం లేదు. ఆస్పత్రులకు బకాయిలే పేరుకుపోవడంతో అవి ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేశాయి. వచ్చిన రోగులకు నిర్మొహమాటంగా సొమ్ము చెల్లిస్తేనే వైద్యం.. ఆరోగ్య శ్రీ కింద అయితే వైద్యం చేయం అని తేల్చి చెప్పేస్తున్నాయి.

## అమ్మో... ఏపీలో సుఖ పురుషులు ఎక్కువ

విజయవాడ, మే 17, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాలలో షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి. దేశవ్యాప్తంగా 2020–21 మధ్య 15 ఏళ్ల నుంచి 49 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిపై నిర్వహించిన సర్వేలో దక్షిణాదిలో ఒకరి కంటే ఎక్కువ మందితో లైంగిక సంబంధాలు ఉన్న మగవారిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మగాళ్లు ముందున్నారు. ఏపీలో మాత్రం ఒక్కో అబ్బాయి తనకు ఒకరి కంటే ఎక్కువ మంది లైంగిక సంబంధాలు ఉ న్నాయని ఒప్పుకున్నట్లు వెల్లడైంది. అటు తెలంగాణలో ఒక్కో పురుషుడు ముగ్గురితో లైంగిక సంబంధం కలిగి ఉన్నట్లు సర్వే ద్వారా తెలిసింది.నేషనల్ హెల్త్ ఫ్యామిలీ సర్వే–5 రెండో విడతలో భాగంగా నిర్వహించిన ఏపీలోని మహిళలతో పోలిస్తే పురుషులు ఎక్కువ మందితో సంబంధాలు కలిగి ఉ న్నామని ఒప్పుకున్నారు. జీవితకాలంలో ఎంతమంది లైంగిక భాగస్వాముల్ని కలిగి ఉన్నారనే ప్రశ్నకు మహిళల సగటు 1.4గా ఉంటే పురుషుల సగటు 4.7గా ఉంది. మిగిలిన దక్షిణాది రాష్ట్రాల కంటే ఏపీలోనే పురుషులకు ఎక్కువ మంది స్త్రీలతో సంబంధాలు కలిగి ఉన్నారు. అటు కర్ణాటకలో పురుషులు 2.7 మందితో, అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో 2.8 మందితో, కేరళ, లక్షద్వీప్ పురుషుల్లో జీవితకాలంలో ఒక్కరితోనే లైంగిక సంబంధం ఉన్నట్లు చెప్పుకున్నారు. మరోవైపు పుదుచ్చేరిలో 1.2గా, తమిళనాడులో 1.8గా నమోదైంది.

## అంబటి వర్సెస్ అయ్యన్న



గుంటూరు, మే 17,ఏపీ మంత్రి అంబటి రాంబాబుపై టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే..! మంత్రి అంబటి రాంబాబు సంస్కార హీనుడు అంటూ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. తెల్లచొక్కా వేసి కళ్లజోడు పెట్టినంత మాత్రాన కామాంధులు సంస్కారవంతులు కాలేరని, హైదరాబాద్‌లోని ఓ టీవీ ఛానల్ వెనక రాసలీలల గెస్ట్ హౌస్ నుంచి.. విజయవాడ హనీ గెస్ట్‌హౌస్ వరకూ అంబటి కామచరిత్ర బయటకు వస్తోందని అయ్యన్న ఆరోపించారు. ఇంకా ఉడత ఊపులు ఎందుకు కామబాబు?.. ఒక యాంకర్ అని నేను మెసేజ్ పెడితే అంబటి, అతని మనుషులు.. ఆరుగురికి ఫోన్లు చేసి తప్పైందని, మెసేజ్‌లు డిలీట్ చేయాలని కోరారని అయ్యన్న అన్నారు. అయ్యన్న పాత్రుడు ఓ ట్వీట్ లో సార్ మీ ఇంటర్వ్యూ కావాలి అంటూ కాంబాబుకి వాట్సాప్ లో ఓ యూట్యూబ్ ఛానల్ యాంకర్ మెసేజ్ చేసిందని.. ఇంటర్వ్యూ ఇస్తా నాకేం ఇస్తావ్ అంటూ కాంబాబు రిప్లై ఇచ్చాడని, త్వరలో ఆ వివరాలు ప్రపంచానికి తెలియజేస్తానంటూ ట్వీట్ చేశారు. "ఆడదైతే చాలు సొంత కూతురుని కూడా వంకర చూపులు, వంకర మాటలు మాట్లాడే రకం ఆయన అంటూ..? త్వరలోనే యుట్యూబ్ యాంకర్ సీఎంను కలబోతుంది.. ఇక మీ చీటీ చినిగినట్టే" అంటూ మరో ట్వీట్ చేశారు. ఇలా వరుస ట్వీట్లను చేశారు అయ్యన్న. టీడీపీ ఆరోపణలపై మంత్రి అంబటి రాంబాబు ఘాటుగా స్పందించారు. "నన్ను అంటారు.. తిరిగి అంటే... టీడీపీతో పాటు ఈనాడు, టీవీ 5, ఆంధ్రజ్యోతి కలసికట్టుగా నా మీద పడి ఏడుస్తారు. ఎంత ఏడ్చినా.. ఎంత మొరొగినా... తగ్గేదేలే!!" అంటూ అంబటి రాంబాబు ప్రతిస్పందించారు. "బట్టబయలు చేస్తాను.. బద్దలుకొడతాను.. బర్తరఫ్ చేయిస్తానని ట్విట్టర్ లోనే మొరుగుతూ సైడ్ అయిపోయిన సన్నాసి ఎవడు ?" అని ఒక ట్వీట్ లో.. "చిన్ని గోపాలుడి బెడ్ రూమ్ లో తుపాకులు పేలడానికి ఎవరి రాసలీలలు కారణం?" అంటూ మరో ట్వీట్ లో పోస్టులు పెట్టారు. "పాఠాలు చెప్పడానికి వచ్చిన టీచర్ తో పని చేయడానికి వచ్చిన పనిమనిషితో రాసలీలలు నడిపిన పప్పు ఎవరు?" అంటూ ఇంకొక ట్వీట్ చేశారు అంబటి.

## కడప గడపలో "గడప గడపకు" మన ప్రభుత్వం

కడప తిరుమల తొలి గడపదేవునికడపలోశ్రీలక్ష్మివెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి"గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని ఉ పముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రారంభించారు. వీధుల్లో పూల తోమహిళలు స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రికి రక్షా బంధన్ కంకణాలను కట్టి అభిమానం, ఆప్యాయత , అనురాగలను వ్యక్తం చేశారు. ఇందులో మొదటి రోజు 85 గడపలు తిరిగి ప్రజల సమస్యలను అంజాద్ బాషా అడిగి తెలుసు కున్నారుగతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకా లను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్నారని వివరించారు

## అసంపూర్తిగా కరకట్ట నిర్మాణం

విజయవాడ, మే 17, కృష్ణా జిల్లాలోని సముద్ర తీర ప్రాంత ప్రజలకు రక్షణ కరువైంది. తుపాను, సునామీల సమయంలో హెచ్చరికల సమయంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. కరకట్ట నిర్మాణం అసంపూర్తిగా నిల్చిపోవడమే ఇందుకు కారణం. రాష్ట్ర విభజనకు ముందు తప్ప, ఆ తర్వాత పనులు జరగలేదు. నిధుల విడుదలలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో, పనులు నిల్చిపోయాయి. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అసని తుపాను మచిలీపట్నం వద్ద బలహీనపడింది. ఎటువంటి ప్రమాదమూ చోటు చేసుకోకపోవడంతో అధికార యంత్రాం గంతోపాటు తీరప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తుపానులు, ఉప్పెనలు, సునామీల హెచ్చరికలప్పుడు ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్ర కెరటాల వల్ల తీరప్రాంత గ్రామాలకు ముప్పు ఎక్కువగా ఉంటోంది. బ్రిటీష్ హయాంలో వచ్చిన తుపాను మచిలీపట్నాన్ని, 1977 ఉప్పెన దివిసీమను ముంచెత్తాయి. ఆ తర్వాత భారీ తుపా నులు, ఇండోనేషియా సుమిత్రా దీవుల్లో ఏర్పడిన భూకంపం కారణంగా వచ్చిన సునామీతో తీరప్రాంతం గ్రామాల్లో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రమాదకర కెరటాల నుంచి తీర ప్రాంత గ్రామాల రక్షణకు కృష్ణా జిల్లాలోని నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం, కృత్తివెన్ను మండలాల్లోని 88 కిలోమీటర్ల తీరం పొడువున దశల వారీగా కరకట్ట నిర్మాణానికి 2009లో వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రతిపాదించింది. వంద కోట్ల రూపాయల వరకూ ఖర్చువుతుందని అప్పట్లో అంచనా వేశారు. దీనికి కేంద ప్రభుత్వం ఆమోదించి నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్‌డిఎంఎ) ద్వారా నిధులు విడుదల చేసిందిదశల వారీగా 44 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మాణం పూర్తయింది. నాగాయలంక, కోడూరు మండలాల్లో పూర్తిగా, మచిలీపట్నం మండలం పల్లెతుమ్మల గ్రామం వరకు, కృత్తివెన్ను మండలంలో ఇంతేరు వద్ద కొంతవరకు పనులు జరిగాయి. మచిలీపట్నం మండలం మంగినపూడి, పెదపట్నం, కృత్తివెన్ను మండలం ఇంతేరు వరకు మరో 40 కిలోమీటర్లు కరకట్ట నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. 2014లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులను విడుదల చేయలేదు. దీంతో, పనులు ఆగిపోయాయి. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ పనుల పూర్తిపై దృష్టి పెట్టలేదు.ఎనిమిదేళ్ల క్రితం పూర్తయిన 44 కిలోమీటర్ల కరకట్ట నిర్మాణానికి రూ.48 కోట్ల వ్యయం అయింది. కిలోమీటరుకు రూ.కోటికిపైగా వెచ్చించారు. మరో 40 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించాల్సి ఉంది. పనుల్లో తీవ్ర జాప్యంతో ఇప్పుడు నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. తాజాగా సమగ్ర నివేదిక (డిపిఆర్)ను రూపొందించాల్సి ఉంది. కేంద్రం నుంచి నిధులు రాబట్టి మిగిలిన కరకట్ట నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కృష్ణా జిల్లాలోని సముద్ర తీర ప్రజలు కోరుతున్నారు.

## అనుమానస్పద స్థితిలో దొంగ మృతి


గూడూరు గూడూర్ లో దారుణ సంఘటన చోటు చేసుకుంది. దొంగ తనానికి వచ్చిన దొంగ అనుమానాస్పద మృతిలో మృతి చెందాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో గూడూరు 2వ పట్టణంలోని పాలిటెక్నిక్ కాలేజ్ ప్రాంతంలో ఒక ఇంటిలోకి జొర పడే దానికి అతను ప్రయత్నించాడు. ఇంటి యజమానులు మెలుకువ వచ్చి అడ్డుకోగా కర్ర తో ఆ ఇంటి కుటుంబ సభ్యులపై దాడిచేసాడు. కుటుంబ సభ్యులు దొంగను తిరిగి కొట్టి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి దొంగని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కొంచెం సేపటికి దొంగ మరణించాడు. దొంగ అ హిందీ లో మాట్లాడుతూ వుండడం తెలుగు పూర్తిగా తెలియకపోవడంతో ఇతను ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనపై రెండో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

## దున్నూరులో గడప గడపకు మన ప్రభుత్వం

శ్రీకాకుళం పథకాల అమలులో మరింత సామ ర్థ్యం పెంచేందుకు వీలుగా ప్రజల నుండి సలహాలు సూచనలు స్వీకరిం చడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని మంత్రి అప్పలరాజు అన్నారు.శ్రీకాకుళం జిల్లా మందస మండలం, దున్నూరు పంచాయతీలో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.గత మూడు సంవత్సరాలలో వైఎస్సార్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజల సలహాలు సూచనలు తీసుకుంటూ సమస్యలను ఆలకిస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఇది ప్రజల ప్రభుత్వం, జగనన్న ప్రభు త్వం అని పార్టీలకతీతంగా పథకాలను అందిచడమే ముఖ్యమంత్రి జగన్మోహ న్రెడ్డి లక్ష్యమని ఆయన తెలియజేశా రు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాల పట్ల ప్రజల్లో మరింత అవగాహన చైతన్యం కల్పించే విధంగా చివరి లబ్ధిదారునికి కూడా పథకం అందుతుందా లేదా అనే విషయాన్ని తెలుసుకొని అందని వారికి గుర్తించి పథకాలు అందేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

## మదనపల్లెలో భారీ వర్షం

మదనపల్లె అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పలు వీధుల్లో మురుగు కాలువలు పొంగిపొర్లాయి. అంబేడ్కర్ సర్కిల్, బుగ్గకాలువ వద్ద మోకాటిలోతు వర్షపునీరు నిలిచిపోవడంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గాంధీరోడ్డు,



బెంగళూరు రోడ్డు, కదిరి రోడ్డులో వర్షపునీరు ప్రవహించి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కాగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బీసెంట్ వీధిలో ఇటీవల మున్సిపల్ అధికారులు మురుగుకాలువ నిర్మాణానికి 200 మీటర్ల పొడవునా గోతులు తవ్వారు. వర్షపు నీరంతా ఈ గోతుల్లో ప్రవహించడంతో ఇదే వీధిలోని లోతట్టులో ఉన్న దివా మొబైల్స్, కంప్యూటర్ స్పేర్ పార్ట్స్ దుకాణంలోకి ఈ గోతుల్లో ప్రవహించిన నీరంతా చేరిపోయింది. దీంతో సుమారు 10 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో పట్టణమంతా చిమ్మచీకట్లో ఉంది.

# ముందస్తు వ్యూహాలేనా...

విశాఖపట్టణం, మే 17, ఐదేళ్లు అధికారంలో ఉండేందుకు జనం మాకు అధికారం ఇచ్చారు? ముందస్తు ఎన్నికలకు ఎందుకు వెడతాం అంటూ వైసీపీ మంత్రులు ఒక పక్క ప్రకటనలు గుప్పిస్తున్నారు. జగన్ మదిలో ముందస్తు ఆలోచన మెదులుతోందంటూ ప్రభుత్వ సలహాదారు సజ్జల సంకేతాలిస్తారు. ప్రభుత్వం మాత్రం ముందస్తు జాతరను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో మొదలెట్టేసింది. అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా నాలుగేళు పూర్తయిన తరువాత ఐదవ ఏడాది ఎన్నికల సంవత్సరంగా భావించి పందేరాలు, ఉచితాలు, ప్రలోభాలతో ప్రజలకు ఎర వేయాలనుకుంటుంది. కానీ జగన్ ప్రత్యేకం..అందుకే అధికారంలోకి వచ్చిన క్షణం నుంచీ పందేరాలు, ప్రలోభాలతో ముందుకు సాగుతూ వచ్చారు. అయితే మూడేళ్లు గడిచేసరికి అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వం ఏ రోజు కారోజు కొత్త అప్పుకోసం వెంపర్లాడే పరిస్థితికి వచ్చేసింది.ఇంక ఇంత కాలం చేసిన పందేరాలను కొనసాగించలేని పరిస్థితుల్లో ముందస్తు జాతరకు సిద్ధమైపోయింది. ప్రచార జాతరకు తెర తీసేసింది. తన వైఫల్యాలను ప్రతిపక్ష పార్టీకి ఆపాదించే ప్రణాళికలను అమలులో పెట్టేస్తోంది. అధికారంలో ఉన్న పార్టీ వైఫల్యాలను విపక్షాలు జనంలో ఎండగట్టడం ఇప్పటి వరకూ అమలులో ఉన్న రివాజు. వైసీపీ దానిని రివర్స్ చేసేసింది. ప్రభుత్వ వైఫల్యాలను కూడా విపక్ష ఖాతాలో వేయడానికి అందుబాటులో ఉన్న అన్ని ప్రచార వనరులనూ యథేచ్ఛగా వాడేసుకుంటోంది. అందులో భాగంగానే రాష్ట్రంలో విద్యుత్ కోతలకు తెలుగుదేశం కుట్రే కారణమంటూ ఓ కొత్త వాదనను తెరమీదకు తీసుకువచ్చింది. అందుకు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటననే వేదిక చేసుకుంది.విద్యుత్ కోతల నెపం చంద్రబాబు కుట్రగా అభివర్ణించడానికి గీత దాటేసింది. ఓ ఛానెల్ లో ప్రసారమైన వార్తా కథనం మేరకు కుప్పంలో చంద్రబాబు పార్టీ శ్రేణులతో ముఖాముఖి కార్యక్రమం కొవ్వొత్తుల వెలుగులో జరిపించడాన్ని ఎత్తి చూపుతూ రాష్ట్రంలో విద్యుత్ లేదని చాటేందుకే చంద్రబాబు కుట్రపూరితంగా విద్యుత్ తీయించేశారన్నది ఆ కథనం. ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేయాలన్న దురుద్దేశంతోనే చంద్రబాబు కుట్రపూరితంగా కుప్పంలో కరెంట్ కట్ చేయించారన్నది ఆ కథనం సారాంశం. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలే లేవనీ, చంద్రబాబు పర్యటన సందర్భంగా కేవలం కుప్పంలోనే కరెంట్ కట్ అవ్వడం వెనుక ఉన్నది ఆయన కుట్రేనని నమ్మించడం ఆ కథనం ఉద్దేశం. అయితే రాష్ట్రంలో విద్యుత్ కోతల గురించి, విద్యుత్ ఉద్యోగులకు వేతనాలు అందక పడుతున్న ఇబ్బందుల గురించీ ఒక ఏపీలోనే కాదు.. దేశం మొత్తం తెలిసిన విషయమే.అంతే కాదు రాష్ట్రంలో రోడ్ల దుస్థితి, విద్యుత్ పరిస్థితి, సాగునీరందక అల్లాడుతున్న రైతుల నిస్సహాయ స్థితి గురించి తెలంగాణ మంత్రి నిర్మోహమాటంగా చెప్పిన సంగతి అందరికీ తెలిసిందే. వాస్తవం ఇలా ఉంటే ప్రత్యర్థి పార్టీపై నెపం నెట్టి..పబ్బం గడిపేసుకునే వ్యూహాలను వైసీపీ అమలు చేస్తున్నది. అలాగే సభ ఏదైనా, సందర్భం ఏదైనా ముఖ్యమంత్రి నుంచి వైసీపీ క్యాడర్ వరకూ విపక్షం వల్లే రాష్ట్రంలో సమస్యలన్నీ అని జనాన్ని నమ్మించే యత్నాలు చేస్తున్నాయి. ఇవన్నీ ఎన్నికల తొందరలోనేనన్నది పరిశీలకుల విశ్లేషణ. మొత్తంగా రాష్ట్ర ప్రజలకు మాయా బజార్ సినిమా చూపించేసి సమస్యల నుంచి వారి దృష్టిని మరల్చేందుకు వైసీపీ ప్రయాసకు ఇది నిదర్శనమని విశ్లేషణలు చేస్తున్నారు.తెలుగుదేశం. జనసేన పొత్తుల ప్రతిపాదనలు, చర్చలపై వైసీపీలో కనిపిస్తున్న గాభరాకు కూడా కారణం ఇదే నంటున్నారు. రాజకీయాలలో పొత్తులు అత్యంత సహజం. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి...అధికార పక్షం అత్తెసరు మార్కులతో పాసయ్యే అవకాశాలు లేకుండా చేసేందుకు పార్టీల మధ్య పొత్తులు ఏపీలోనే మొదలు కాలేదు. ఎమెర్జన్సీ అనంతర ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకత ఓట్ల రూపంలో గంప గుత్తగా అప్పటి జనతా పార్టీకే రావడానికి కారణం నిస్సందేహంగా పొత్తులే. యూపీఏ, ఎన్డీయే కూటములు పొత్తుల వల్లనే కదా ఏర్పడ్డాయి. ఏపీలో పొత్తులు తమ అధికారానికి చేటు తెస్తాయన్న భయంతోనే వైసీపీ జనసేన, తెలుగుదేశం పొత్తు మాట వింటేనే బెదిరిపోతున్నదని పరిశీలకులు అంటున్నారు. కేంద్రంలో వరుసగా రెండు పర్యాయాలు మోడీ సర్కార్ అధికారంలోకి రావడానికి విపక్షాల అనైక్యతే కారణమన్నది నిర్వివాదాంశం. అందుకే పార్టీలన్నీ కూడా బీజేపీయేతర కూటమి ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏపీలో కూడా తెలుగుదేశం, జనసేనల మధ్య పొత్తు చర్చలు, ప్రతి పాదనలకు కూడా వైసీపీకి వ్యతిరేక ఓటు చీలిపోకూడదనే. ఆ పొత్తులు పొడవకముందే, తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం నిలిచిపోకముందే ఎన్నికలకు వెళ్లి లబ్ధి పొందాలన్న తొందర వైసీపీలో కనిపిస్తోంది.

## వృత్తి శిక్షణ నిపుణుల కోసం ఇంటర్వ్యూలు

కడప యోగి వేమన విశ్వవిద్యాల యం లలిత కళల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే డిప్లమో సర్టిఫికెట్ కోర్సులకు వృత్తిపరమైన శిక్షణ నిపుణుల నియామకానికి ఈ నెల 20వ తేదీన నేరుగా ముఖాముఖి (ఇంటర్వ్యూలు) నిర్వహించను న్నట్లు పీజీ కళాశాల ప్రధానాచా ర్యులు ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. ప్రధానంగా కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం , లలిత సంగీతం, జానపద సంగీతం, తబలా, కీ బోర్డు, డప్పు సంబంధిత వాద్య పరికరాలలో నిపుణుల అవసరం ఉందన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్/ గ్రాడ్యుయేషన్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యాపరమైన అర్హతలు లేనప్పటికి ఆయా కళల్లో నిష్ణాతులైన వారు కూడా అర్హులేనని తెలిపారు. గంటలవారిగా( నిర్దేశించినఅవర్ బేసిస్ విధానంలో )నిపుణులకు చెల్లింపులు ఉంటాయన్నారు. 8 నెలల శిక్షణ కాలంలో వారానికి 12 గంటల చొప్పున విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.2021-22 విద్యాసంవత్సరానికి ఈ ఎంపికలు చేస్తున్నామని తెలిపారు. కడప నగరంలో సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో 20వ తేదీ ఉదయం 10 గంటలకు అన్ని రకాల ఒరిజినల్ అర్హత పత్రాలతో,తమ వాద్యపరికరాలతో అభ్యర్థులు హాజరు కావాలని ప్రిన్సిపల్ సూచించారు.

## ప్రభుత్వ నిర్వాహకంతో పుట్టెడు కష్టాల్లో కూరుకుపోయిన రైతులు



**-టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి**

నెల్లూరు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వపాలనలో వ్యవసాయ రైతులు పుట్టెడు కష్టాల్లో కూరుకుపోయారని టిడిపి నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి పేర్కొన్నారు.నెల్లూరు జిల్లా కోవూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతులకు తీరని నష్టం జరిగిందని,నేను అధికారంలోకి వస్తే రైతులకు అన్ని విధాలా మేలు చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఈ 3 సంవత్సరాల పాలనలో రైతాంగాన్ని నట్టేట ముంచార అని తన ఆవేదన వ్యక్తపరిచారు.రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయలేదని ఆరోపించారు.రైతు భరోషా క్రింద ప్రతి రైతుకు రూ.12,500 ఇస్తానని మ్యానిఫెస్టోలో చెప్పి, అధికారం వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.6 వెలతో కలిపి రూ.18,500 ఇవ్వవలసి ఉండగా రూ.13,500 ఇస్తూ ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.5వేలు చొప్పున రూ.20 వేలు ఎగనాం పెట్టారని ఆక్రోశం చెందారు.వైసీపీ పాలనలో రైతు పండించిన పంటలు కొనే నాధుడే లేక రైతులు గత్యంతరం లేక తాము పండించిన పంటలను తెగ నమ్ముకుంటున్నారని అన్నారు.గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇస్తున్న సబ్సిడీ లన్నీ ఎత్తి వేశారని అంతేకాకుండా భూసార పరీక్షలు సైతం ఆపేయడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కు మీటర్లు బిగిస్తే రైతులకు ఏమి నష్టం అని వాదిస్తున్న ప్రభుత్వం దాని వలన నష్టం లేనప్పుడు మీటర్లు బిగిస్తామని మీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.ఒక వైపు పెరిగిన సాగు ఖర్చులు,మరో వైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో నెల్లూరు జిల్లా కోవూరు లాంటి డెల్టా ప్రాంతంలో గతములో ఎన్నడూ లేని విధంగా రైతులు క్రాఫ్ హాలిడే ప్రకటించారంటే ఈ ప్రభుత్వంలో రైతుల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్ధమౌతుందన్నారు.గత తెలుగుదేశం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకోవడం కోసం ఐదు విడతలో రూ. 24,500 కోట్లతో రైతు రుణమాఫీ చేసింది.దీనిలో భాగంగా తెలుగుదేశం ప్రభుత్వం మూడు విడతలు చెల్లించిందని తెలియజేశారు. నాలుగో విడత చెల్లించే సమయంలో వైసీపీ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేయగా ఎన్నికల సంఘం నిలిపివేసిందన్నారు.తదుపరి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి 4,5 విడతల రుణమాఫీ సొమ్ము ఇవ్వకుండా నిలిపివేశారు. జగన్మోహన్ రెడ్డి నిర్వాహకం వలన రాష్ట్రం లోని రైతులు పుట్టెడు కష్టాల్లో ఉన్నారు.ప్రభుత్వానికి రైతులు పై ఏమాత్రం సానుభూతి ఉన్న ఇప్పిటకైనా 4,5 విడతల రుణమాఫీ బకాయిలను రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.ధాన్యం తొలి మూడు నెలలు అవుతున్న రైతులకు ఇప్పిటి వరకు రైతులకు నగదు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం బకాయులు చెలించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కంరెడ్డి భాస్కర రెడ్డి,పాశం పరందామయ్య,ఇంటూరు విజయ్,బుధవరపు శివకుమార్,మారుబోయిన వెంకటేశ్వర్లు, కె గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## డి ఎస్ పి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

సుల్తానాబాద్ మే17 తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 3 కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపన కై డి ఎస్ పి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ చేస్తున్న 10 వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రకు సంఘీభావంగా స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద డీఎస్పీ జిల్లా కన్వీనర్ కనకం గణేష్ మహారాజ్ జిల్లా కోకన్వీనర్ న్యాతరి శ్రీనివాస్ మహారాజ్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చిలువేరు .శ్రీకాంత్ మహారాజ్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా సీనియర్ నాయకులు మాదుగుల. సదానంద మహారాజ్ హాజరై మాట్లాడుతూ విశారదన్ మహారాజ్ సాహసోపేత నిర్ణయం తీసుకొని తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పాదయాత్ర చేస్తూ బిసి ,ఎస్సీ, ఎస్టీలను చైతన్యం చేస్తున్నారన్నారు సమాజంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ ,ఎస్టీలు రాజ్యాధికారానికి దూరం అవుతున్నారు 10 శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజ్యాధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకొని అట్టడుగు వర్గాలను అణచివేస్తూన్నారు అని ఆరోపించారు వచ్చే ఎన్నికల వరకు బీసీ ,ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం చేపట్టేందుకు అన్ని వర్గాలు కలిసి రావాలని పాదయాత్రకు సంఘీభావం తెలపాలన్నారు అన్ని వర్గాలు కలిసి రావాలని పాదయాత్రకు సంఘీభావం తెలపాలని అన్నారు ఈ సందర్భంగా వివిధ వర్గాల నుండి సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రుద్రారం కనకయ్య మహారాజ్, రిటైర్డ్ హెచ్.ఎం అర్నకొండ నరసయ్య మహారాజ్ ,మండల ఉపాధ్యక్షులు ఆవునూరి.సతీష్ మహారాజ్,ఎద్దుల శంకర్ మహారాజ్, క్యాదసి రమేష్ మహారాజ్ , మారుపాక రమేష్ మహారాజ్ , కృష్ణ మహారాజ్, రము మహరాజ్ , మాతంగి తిరుపతి మహారాజ్, మైనార్టీ నాయకులు హకిం కలీం రహీం ఏ ఎన్ ఎమ్ శారద రమాదేవి ఆశా కార్యకర్తలు స్వప్న పోగుల రఘువీర్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలు మానుకోకుంటే చంపేస్తాం

**తెదేపా నేతకు బెదిరింపులు**

కడప వైఎస్సార్ జిల్లా కమలాపురంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాయినాథ్ శర్మ కారును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రాజకీయాలకు దూరం కాకుంటే చంపేస్తామంటూ కాగితాలపై రాసి... కారుకు అంటించారు. కారుకు పట్టిన గతే నీకూ పడుతుందంటు రాసిన కాగితాలను సాయినాథ్ శర్మ కారుకు, ఇంటి గోడలకు అంటించారు. రాజకీయాలకు దూరం కాకుంటే చంపేస్తామంటూ కాగితాలపై రాసి.. కారుకు అంటించారు. కారుకు పట్టిన గతే నీకూ పడుతుందంటు రాసిన కాగితాలను సాయినాథ్ శర్మ కారుకు, ఇంటి గోడలకు అతికించారు. కమలాపురంలో రామాపురం గుడి వద్ద కారు నిలిపి ఉండగా.. దుండగులు దాడి చేసి ధ్వంసం చేశారు. రామాపురం క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా.. ఆలయంలోనే నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అర్ధరాత్రి దాటాక కారును ధ్వంసం చేసినట్లు.. తెలుగుదేశం నాయకులు భావిస్తున్నారు. దాడి ఘటనపై.. సాయినాథ్శర్మ ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బుధవారం కమలాపురంలో చంద్రబాబు బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తుండగా.. ఈ దాడి జరగడం చర్చనీయాంశమైంది. కొన్ని రోజులుగా సాయినాథ్ శర్మ తెలుగుదేశం చేపడుతున్న కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ తరుణంలో దాడి జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## పట్టణ ప్రగతితో అభివృద్ధికి బాటలు

**-మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్**

మంథని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పట్టణ ప్రగతితో అభివృద్ధికి బాటలు పడుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ అన్నారు. పట్టణ ప్రగతిలో బాగంగా మంథని మున్సిపల్ పరిదిలోని నాలుగో వార్డులో పట్టణ ప్రగతిలో బాగంగా రూ.6లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో పల్లెలు, పట్టణాల ముఖ చిత్రాలు మారిపోయాయన్నారు.గత విడతల్లో నిర్వహించిన పట్టణ ప్రగతిలో నిదులు కేటాయించి అభివృద్ది పనులు చేపట్టడం జరిగిందన్నారు. బంగారు తెలంగాణ సాధనలో బాగంగానే పల్లెలు, పట్టణాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి బాటలు వేస్తున్నారని, ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు అనేక అభివృద్ధి పనులతో ప్రజలకు సౌకర్యాలు, వసతులు మెరుగుపర్చుతున్నట్లు ఆయన తెలిపారు.పట్టణ ప్రగతిలో నిదులు కేటాయించి అభివృద్ధికి సహకారం అందించిన మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, జెడ్పీ చైర్మన్ పుట్ట మధులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ కుర్ర లింగయ్య, నాయకులు ప్రభాకర్రెడ్డితో పాటు స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ నేతలు

తాడేపల్లి బైపాస్ రోడ్ లోని రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. మంగళవారం బిజెపి ముట్టడి పిలుపు నేపథ్యంలో కమిషన్ కార్యాలయం వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు అయింది. పోలీసులు ప్రకాశం బ్యారేజి పరిసర ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం చేరుకున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసారను. రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దేవానంద్ ను అరెస్ట్ చేసి మంగళగిరి పోలీస్ స్టేషన్ కు తరలించారు. 34 మంది బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు

## లారీ బైక్ ఢీ ఒకరి మృతి ముగ్గురికి గాయాలు...

తిరుపతి దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదం సంభవించింది. బైక్ ను వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది, ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దొరవారి సత్రం ఎస్సై అజయ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు....

## ఏసీబీ వలలో ఆర్ అండ్ బి అధికారి

కడప కడప ఆర్అండ్ బి కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఒక అవినీతి అధికారి దొరికిపోయాడు. సీనియర్ అసిస్టెంట్ గల్లు సాహెబ్ పిర్యాదు దారుడినుంచి 10వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు ఏసీబీ అధికారులు ఆర్ అండ్ బి కార్యాలయంలో సోదాలు నిర్వహించారు.

## జీడీ తోటలో పింజర పాము హల్చల్

ఏలూరు ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం వాలిసుగ్రీవుల గట్టు సమీపంలో జీడి తోటలో పది అడుగుల పింజర పాము కాసేపు హల్ చల్ చేసింది. జీడిగింజలు ఏరుతున్న కూలీలకు పది అడుగులకు పైగా ఉన్న పింజర పాము కనిపించటంతో కూలీలు భయపడ్డారు. పామును చూసి కూలీలు కేకలు వేయటంతో సమీప పొలాల్లో ఉన్న వారందరూ వచ్చి చి పామును హతమార్చారు. దీంతో కూలీలు ఊపిరిపీల్చుకున్నారు.

## ఎర్రచందనం డంపు గుర్తింపు

కడప ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి, మంటపం పల్లి వద్ద భారీగా ఎర్రచందనం డంప్ ను పోలీసులు పట్టుకున్నారు. 100 ఎర్ర చందనం దుంగలు, ( దాదాపు రెండు టన్నుల బరువున్న) ఎర్రచందనం దుంగలు, స్కోడా కారు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న స్మగ్లర్ల ఆస్తులను సీజ్ చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు పది కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులను స్మగ్లర్ల నుంచి జప్తు చేస్తామని తెలిపారు. కడప డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎర్ర చందనం యాంటీ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ నాగార్జున, ఒంటిమిట్ట సి.ఐ రాజా ప్రభాకర్, ఒంటిమిట్ట ఎస్.ఐ సంజీవ రాయుడు, సిబ్బంది ని ఎస్.పి ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందచేశారు.

# బీసీ కుల గణన చేపట్టాలి:- వై.నాగేశ్వరరావు యాదవ్



తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్
రాష్ట్ర గొర్రెల పెంపకం దారుల ఫెడరేషన్ ఛైర్మన్
జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

కర్నూలు ,ఈ రోజు గుంటూరు లోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడి గారి పిలుపు మేరకు రాష్ట్ర బీసీ సాధికారిక సమితి నాయకులతో మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర గారు,బీదా రవిచంద్ర గారు,రామారావు గారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం లో?? తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారత కమిటీ రాష్ట్ర కన్వీనర్ ?? రాష్ట్ర గొర్రెల పెంపకం దారుల ఫెడరేషన్ చైర్మన్ ??జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్?? వై.నాగేశ్వరరావు యాదవ్ గారు, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి సత్రం రామకృష్ణుడు గారు,టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ రాజు యాదవ్ గారు, నంద్యాల జిల్లా బీసీ సెల్ నాయకులు తిరుపల్ బాబు గారు,మల్లికార్జున గారు,టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర నాయకులు,బీసీ నాయకులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో వై.నాగేశ్వరరావు యాదవ్ గారు మాట్లాడుతూ:-దశాబ్దాల పాటు బీసీలు వెనుకబడి ఉన్నారు.బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. . బీసీలకు ఓటు హక్కు కల్పించిన మహోన్నత వ్యక్తి అన్న నందమూరి తారక రామారావు గారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నందమూరి తారక రామారావు గారి అడుగుజాడల్లో ఈనాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారు బీసీ పురోగతికి పెద్ద పీట వేశారు. బీసీలకు రాజ్యాధికారం లో భాగం కావాలి. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి. బీసీ కుల గణన, జనగణన జరపాలి. గత ప్రభుత్వ హయాంలో లోకల్ బాడీలో బీసీలకు 34 శాంతం కేటాయిస్తే ఈ రాష్ట్రప్రభుత్వం బీసీలకు 10 శాతం కోత విధించిం 24% మాత్రమే కేటాయించింది. దీన్నిబట్టి మనకు అర్థమవుతుంది ఏ ప్రభుత్వ హయాంలో బీసీలకు న్యాయం జరిగిందో నని. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక బీసీ బడుగు బలహీన వర్గాల పై దాడులు రాను రాను ఎక్కువైపోతున్నాయి. అన్ని కులాలు కులాలకు ప్రాధాన్యతనిస్తూ తెలుగుదేశం పార్టీ గుర్తింపు ఇచ్చింది. బీసీలకు పార్లమెంట్లో ప్రాధాన్యత కల్పించాలి.బీసీల తలరాతలు మారాలన్నా బీసీల బతుకులు బాగు పడాలన్న ఒక్క తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యం. బీసీలు అందరూ ఏకమై తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రిని చేస్తేనే మన అందరి బతుకులు బాగుపడతాయి.భారతదేశంలో 56 శాతం బీసీలు ఉన్నప్పటికీ రాజకీయంగా అన్ని రంగాలలో కూడా వెనకబడి ఉన్నాము. ఏ రాజకీయ పార్టీలో కూడా బీసీలకు మంత్రి పదవులు దక్కలేదు కానీ ఒక తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు మంత్రి పదవులు దక్కాయి. బీసీల జనాభా ను లెక్కించి జనాభా ప్రకారం బీసీలకు కావలసిన వాటాను, జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాం. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి బీసీ కుల గణన చేపట్టాలని తెలుగుదేశం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం. బీసీ కుల గణన పై రాష్ట్ర ప్రభుత్వానికి గానీ కేంద్ర ప్రభుత్వానికి గానీ ఎలాంటి చిత్తశుద్ధి లేదు.ఈ రాష్ట్ర ప్రభుత్వం బి సి ల సంక్షేమం కొరకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం జరిగినది.కానీ కార్పొరేషన్లకు ఏర్పాటు చేసిన తర్వాత వీటికి నిధులుకానీ,విధులు కానీ కేటాయించడం లేదు. నాయకులు మాత్రం ఉత్సవ విగ్రహాల వలె వున్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో 13 జిల్లాల్లో 5 కోట్లతో బిసి భవనాలను ఏర్పాటు చేసారు.కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ భవనాలను పునాధులకే పరిమితం చేసి పట్టించుకునే పాపాన పోలేదు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బీసీలను బలోపేతం చేసేందుకు కృషి చేదాం. బీసీలు మొత్తం శ్రమించి తెలుగుదేశం పార్టీని ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గారిని అధికారంలోకి వచ్చేంతవరకు సమిష్టిగా పని చేయాలి.అనంతరం.......... తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులను గజమాల వై.నాగేశ్వరరావు యాదవ్ గారు సన్మానించడం జరిగినది.

# గడప గడప నిర్వహించిన కర్నూలు శాసనసభ్యులు హఫీజ్ ఖాన్

కర్నూలు :- కర్నూలు శాసనసభ్యులు హఫీజ్ ఖాన్ కర్నూలు నగరం లోని స్థానిక 6వ వార్డులో గడప గడప కార్యక్రమం నిర్వహించారు. ప్రజల దగ్గరికి వెళ్లి ప్రభుత్వం యొక్క పనితీరు , అలాగే సమస్యల పై ప్రజలను అడిగి తెలుసుకున్నారు .ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి ఎన్ని రూపాలలో అందిచారో క్లుప్తంగా వారికీ తెలియపరిచారు. వీధులలో నెలకొన్న పలుసమస్యలను ప్రజలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ కు తెలియజేశారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు ఫోన్ చేసి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు , సచివాలయం సిబ్బంది వాలంటీర్స్ మున్సిపాలిటీ సిబ్బంది , ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ఆత్మీయ స్వాగతం....ఘనంగా వీడ్కోలు







ఓర్వకల్లు , మే 17:-ప్రపంచంలో అతిపెద్ద ఏకీకృత (ఇంటిగ్రేటెడ్) పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల శంకుస్థాపన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉదయం 10:42 గంటలకు ఓర్వకల్లు ఎయిర్పోర్టుకు చేరుకున్నారు.ఓర్వకల్లు ఎయిర్పోర్టుకు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్ సెంథిల్ కుమార్, నగర ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్,నగర మేయర్ బి. వై.రామయ్య, అడిషనల్ ఎస్పి, జాఇః తుహిన్ సిన్హా, నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ఘన వీడ్కోలు :-కర్నూలు జిల్లా గుమ్మటం (ఫస్ట్ కాంక్రీట్ పోరింగ్ సెర్మోని కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకుని మధ్యాహ్నం 12:52 గంటలకు ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ నుంచి తిరుగు ప్రయాణంలో గన్నవరానికి బయల్దేరిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, నగర మేయర్ బి.వై. రామయ్య, కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్ సెంథిల్ కుమార్, నగర ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ్ తదితరులు సాదరంగా ఘనవీడ్కోలు పలికారు.

# కర్నూలు జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన డి. ప్రసాద్



కర్నూలు మే 17 :- కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నూతన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా డి. ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఇంతకు మునుపు పని చేసిన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. మధుసుధన రావు విశాఖ పట్నం మెరైన్ కు బదిలీ కావడం జరిగింది.బాధ్యతలు చేపట్టిన నూతన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జిల్లా ఎస్పీ సిహెచ్ . సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి. ప్రసాద్ గురించి క్లుప్తంగా చెప్పాలంటే ..... ఈయన 1991 లో ఎస్ఐ హోదాలో పోలీస్ శాఖలో చేరారు . 2002 లో సీఐగా , 2011 లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. పల్నాడు ప్రాంతంలో పనిచేశారు. 2021 ఆగస్టులో అదనపు ఎస్పీ గా పదోన్నతి పొంది కావలి డిఎస్పీగా విధులు నిర్వహిస్తూ కర్నూలు జిల్లా కు బదిలీ పై వచ్చారు.

# 'ఎఫ్ 3' తర్వాత ఆమె పరిస్థితి ఏంటీ?

కృష్ణగాడి వీర ప్రేమగాథ సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన పంజాబీ ముద్దుగుమ్మ మెహ్రీన్. తెలుగు లో మొదటి సినిమా తోనే జూనియర్ మిల్కీ బ్యూటీ అంటూ పేరు దక్కించుకున్న మెహ్రీన్ కు పెద్ద పెద్ద సినిమాల్లో ఛాన్స్ లు రాకున్నా కూడా ఒక మోస్తరుగా సక్సెస్ లు దక్కడంతో మీడియం రేంజ్... యంగ్ హీరోలతో నటించే అవకాశాలు దక్కిన విషయం తెల్సిందే.తెలుగు తో పాటు తమిళం మరియు పంజాబీ కన్నడం లో కూడా అప్పుడప్పుడు నటిస్తున్న ఈ అమ్మడు మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆ మధ్య పెళ్లికి సిద్దం అయ్యి నిశ్చితార్థం వరకు కూడా వెళ్లింది. కాని కొన్ని కారణాల వల్ల పెళ్లి క్యాన్సిల్ అయ్యింది. మెహ్రీన్ పెళ్ల క్యాన్సిల్ అవ్వడంతో అభిమానులు ఆమె మరిన్ని సినిమాల్లో నటిస్తుందని ఒకింత ఆనందం వ్యక్తం చేశారు అనడంలో సందేహం లేదు.కెరీర్ పరంగా మెల్ల మెల్లగా సినిమాలు అయితే చేసుకుంటూ వెళుంది కాని ఇప్పటి వరకు ఒక స్టార్ డమ్ అనేది మెహ్రీన్ కు దక్కలేదు. ఈ సినిమా తర్వాత.. లేదా ఆ సినిమా తర్వాత స్టార్ డమ్ వస్తుందని భావించింది. కాని ఆమె సినిమా సినిమా కు అలాగే ఉంటుంది తప్ప మార్పు లేదు. ఎఫ్ 2 సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకున్నా కూడా స్టార్ హీరోల నుండి పిలుపు మాత్రం రాలేదు.ఇప్పుడు ఎఫ్ 3 సినిమా తో మెహ్రీన్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్దం అయ్యింది. అనీల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో వరుణ్ తేజ్ కు జోడీగా మెహ్రీన్ నటించిన విషయం తెల్సిందే. సినిమా ఈ నెలలో విడుదలకు సిద్ధంగా ఉంది. మంచి అంచనాలున్న ఎఫ్ 3 సినిమా విజయం ఖాయం అనే నమ్మకం వ్యక్తం అవుతుంది.ఎఫ్ 3 సినిమాపై చాలా ఆశలు పెట్టుకుని మెహ్రీన్ ఎదురు చూస్తుంది. ఈ సినిమా సక్సెస్ అవ్వడంతో పాటు ఆమె పాత్రకు కూడా మంచి పేరు వస్తే మరికొంత కాలం పాటు ఇండస్ట్రీలో కొనసాగే అవకాశం ఉంటుందని మెహ్రీన్ ఆశ పడుతుంది. ఎఫ్ 3 సినిమా కాకుండా టాలీవుడ్ లో మరే సినిమాను ఈ అమ్మడు చేస్తున్నట్లుగా కనిపించడం లేదు. ఒక కన్నడ సినిమా షూటింగ్ దశలో ఉంది.ఎఫ్ 3 కి ముందు తెలుగు లో ఈమె చేసిన సినిమాలు నిరాశ పరిచాయి. అశ్వథామ.. మంచి రోజులు వచ్చాయి సినిమాలు మెహ్రీన్ కు నిరాశను మిగిల్చాయి. దాంతో ఎఫ్ 3 సినిమా కెరీర్ లో మరో రెండు మూడు సంవత్సరాలు కొనసాగేలా మంచి పేరు దక్కించుకుంటుందని అభిమానులు భావిస్తున్నారు. మరి ఈ సినిమా ఆమెకు ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.



# మరో అరవ డైరెక్టర్ ను దించబోతున్న మాస్ రాజా

ఈమధ్య కాలంలో తమిళ హీరోలు తెలుగు లో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తమిళ ఫిల్మ్ మేకర్స్ తెలుగు హీరోలను డైరెక్ట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తమిళ హీరోలు అయిన విజయ్.. ధనుష్.. శివ కార్తికేయన్ ఇంకా కొందరు హీరోలు తెలుగు దర్శకులతో వర్క్ చేసేందుకు ఇప్పటికే కమిట్ అవ్వడం... షూటింగ్ కూడా ప్రారంభం అవ్వడం జరిగింది.ఇక తమిళ దర్శకులు అయిన శంకర్.. లింగు స్వామి.. అట్లీ.. మురుగదాస్ తో పాటు మరి కొందరు దర్శకులు తెలుగు హీరోలను డైరెక్ట్ చేశారు.. చేస్తున్నారు. టాలీవుడ్ కు పాన్ ఇండియా స్థాయిలో మంచి పేరు రావడం వల్ల హీరోలు మరియు దర్శకులు తెలుగు లో సినిమా పై చాలా ఆసక్తిగా ఉన్నారు. ఇప్?పటికే ఎంట్రీ ఇచ్చిన వారు కాకుండా మరి కొందరు అరవ తంబీలు కూడా ఎంట్రీకి సిద్దం అయ్యారు.పాన్ ఇండియా మార్కెట్ ను దృష్టిలో పెట్టుకుని తమిళ దర్శకులు తెలుగు హీరోలకు సరిపోయే కథలను రాస్తున్నారట. తాజాగా రవితేజకు ఒక తమిళ దర్శకుడు చెప్పిన కథ నచ్చిందని.. ప్రస్తుతం రవితేజ చేస్తున్న సినిమాలు పూర్తి అయిన వెంటనే చేసేందుకు ఓకే చెప్పాడని వార్తలు వస్తున్నాయి. ఆ దర్శకుడు మరెవ్వరో కాదు బాలాజీ మోహన్.తమిళంలో మంచి గుర్తింపు ఉన్న బాలాజీ మోహన్ ఇప్పటికే అక్కడ లవ్ ఫెయిల్యూర్.. మారి మరియు మారి 2 సినిమాలను చేసిన విషయం తెల్సిందే. మూడు సినిమాలు కూడా ఆయన స్థాయిని పెంచాయి. తమిళంలో మంచి పేరు దక్కించుకున్న ఈయనతో యంగ్ హీరోలు చేసేందుకు చాలా ఆసక్తిగా ఉన్నారట. కాని ఆయనకు మాత్రం తెలుగు లో సినిమా చేయాలనే కోరిక బలంగా ఉన్నట్లుగా అనిపిస్తుంది.అందుకే రవితేజ కోసం కథను సిద్ధం చేసి ఇటీవలే చెప్పాడట. ప్రస్తుతం రవితేజ ధమాకా.. రాక్షసుడు.. టైగర్ నాగేశ్వరరావు సినిమాలు చేస్తున్నాడు. ఆ మూడు సినిమాలకు తోడుగా ఇప్పటికే రామారావు ఆన్ డ్యూటీ సినిమా విడుదలకు సిద్దంగా ఉంది. ఈ ఏడాది చివరి వరకు రవితేజ క్యాలెండర్ ఫుల్ బిజీగా ఉంది. కనుక ఆయన హీరోగా బాలాజీ మోహన్ సినిమా వచ్చే ఏడాది ఆరంభంలో పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయి.రవితేజ సన్నిహితులు మరియు సినీ వర్గాల వారి నుండి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం బాలాజీ మోహన్ తయారు చేసిన కథ పాన్ ఇండియా అప్పీల్ ఉంటుందని అంటున్నారు. ఆ కథ ను పాన్ ఇండియా రేంజ్ లో రవితేజ తో చేస్తే తప్పకుండా తెలుగు.. తమిళంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా మంచి విజయాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉందంటున్నారు.



# ఈసారి బాక్సాఫీస్ బద్దలే.. మెగాస్టార్ కోసం కొత్త ప్లాన్

గత కొన్నేళ్లుగా సినిమాలకు దూరంగా వున్న మెగాస్టార్ 'ఖైదీ నంబర్ 150' చిత్రంతో మళ్లీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు. తమిళ బ్లాక్ బస్టర్ 'కత్తి' ఆధారంగా ఈ చిత్రాన్ని చిరుతో రీమేక్ చేశారు. ఆ తరువాత కొంత వెంటనే 'సైరా నరసింహారెడ్డి' చేసిన మెగాస్టార్ ఈ మూవీ ఆశించిన ఫలితాన్ని అందించకపోవడంతో వెంటనే 'ఆచార్య'ని స్టార్ట్ చేశారు. కోవిడ్ కారణంగా దాదాపు రెండేళ్ల విరామం తరువాత ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. అయితే ఇదే సమయంలో మున్నడూ లేనంతగా యంగ్ హీరోలకు ధీటుగా చిరు బ్యాక్ టు బ్యాక్ నాలుగు చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.మాంచి జోష్ తో కనిపించారు. చాలా మంది యంగ్ హీరోలతో కలిసి నటించాలని ఆసక్తిని చూపించారు. మొత్తానికి శృతిహాసన్ ని ఓ సినిమాకు హీరోయిన్ గా ఫైనల్ చేసుకున్నారు కూడా. కానీ మెగాస్టార్ జోష్ ని ఒక్కసారిగా 'ఆచార్య' నీరుగార్చింది. రెండేళ్ల విరామం తరువాత థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం ఊహించని విధంగా చిరుతో పాటు ఆయన అభిమానులకు షాకిచ్చింది. దీంతో భారీ అంచనాలు పెట్టుకున్న సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ ఫ్లాప్ గా నిలవడంతో చిరు కూడా ఆసంతృప్తికి లోనయ్యారట.ఎక్కడ లోపం జరిగిందన్నది పాయింట్ అవుట్ చేస్తూ 'ఆచార్య' తప్పుల్ని తన తదుపరి చిత్రాల్లో పునరావృతం కాకుండా చూసుకోవాలని స్క్రిప్ట్ లలో మార్పులు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం మెగాస్టార్ మూడు చిత్రాల్లో నటిస్తున్నారు. మోహన్ రాజాతో 'గాడ్ ఫాదర్' మెహర్ రమేష్ తో 'భోళా శంకర్' చిత్రాలు చేస్తున్నారు. ఇవి రెండూ రీమేక్ చిత్రాలే. ఇక బాబి డైరెక్షన్ లో స్ట్రెయిట్ మూవీ చేస్తున్నారు. దీనికి 'వాల్తేరు వీరయ్య' అనే టైటిల్ ని ఫైనల్ చేశారు.మూడు క్రేజీ ప్రాజెక్ట్ లలో నటిస్తున్న చిరు ఇందులో ఎలాంటి తప్పులు దొర్లకుంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఇందుకు సంబంధించిన మార్పులు చేర్పులు చేస్తున్నారట. భారీ అంచనాల మధ్య విడుదలైన 'ఆచార్య' అనూహ్యంగా డిజాస్టర్ గా మారడమే కాకుండా 80 శాతం నష్టాలని మిగల్చడంతో అలాంటి పరిస్థితి మరో సినిమాకు రాకూడదని తగు జాగ్రత్తలు తీసుకోవాలని దర్శక నిర్మాతలకు సూచిస్తున్నారట. ఇదిలా వుంటే ఈ మూడు క్రేజీ చిత్రాలలో ప్రధానంగా చిరు 'గాడ్ ఫాదర్'పై భారీ నమ్మకంతో వున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మలయాళంలో సూపర్ హిట్ అయిన కథ కావడంతో తెలుగులోనూ ఇది బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని చిరు భావిస్తున్నారట.అందుకే ఈ చిత్రాన్ని ఆగస్టు 12న ప్రేక్షకుల ముందుకు తీసుకురవాలని ప్లాన్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇదిలా వుంటే ప్రస్తుతం ఫ్యాన్స్ మాత్రం 'వేదాలం' రీమేక్ ఆధారంగా తెరకెక్కుతున్న 'భోళా శంకర్' విషయంలోనే టెన్షన్ పడుతున్నారట. చాలా కాలంగా డైరెక్షన్ కు దూరంగా వుంటూ వచ్చిన మెహర్ రమేష్ ఈ చిత్రానికి దర్శకుడు కావడమే మెగా ఫ్యాన్స్ ఆందోళనకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పైగా ఈ మూవీలో మార్పులు చేస్తేనే బాగుంటుందని అభిమానులు చిరు కూడా కోరుతున్నారట. 'వాల్తేరు వీరయ్య' విషయంలోనూ ఫ్యాన్స్ స్పందన ఇదే తరహా వుండటంతో ప్రస్తుతం మార్పులు చేస్తున్నారని ఇన్ సైడ్ టాక్.



# భారత్‌తో టీ20 సిరీస్‌కు జట్టును ప్రకటించిన దక్షిణాఫ్రికా.. సీనియర్ బౌలర్ రీఎంట్రీ



టీమిండియాతో టీ20 సిరీస్‌కు దక్షిణాఫ్రికా 16 మంది సభ్యులతో కూడిన తమ జట్టును మంగళవారం ప్రకటించింది. ఈ జట్టుకు టెంబ బావుమా సారథ్యం వహించనున్నాడు. ఇక యువ ఆటగాడు ట్రిస్టన్ స్టబ్స్ దక్షిణాఫ్రికా తరుపున టీ20ల్లో అరంగేట్రం చేయనున్నాడు. అదే విధంగా ఆ జట్టు వెటరన్ పేసర్ వేన్ పార్నెల్ 2017 తర్వాత తొలి సారిగా టీ20ల్లో ఆడనున్నాడు.అదే విధంగా గాయం కారణంగా గత కొంత కాలంగా జట్టుకు దూరమైన అన్రీచ్ నోర్జే కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఇక భారత పర్యటనలో భాగంగా ప్రోటీస్ జట్టు ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. తొలి టీ20 ఢిల్లీ వేదికగా జూన్ 9న ప్రారంభం కానుంది. మరో వైపు భారత జట్టును బీసీసీఐ ఒకట్రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది.

## మనం కచ్చితంగా ప్లే ఆఫ్సకు వెళ్తాం... కోల్‌కతాలో..

"మైదానం లోపల, వెలుపలా.. ఇక్కడున్న ప్రతి ఒక్కరితో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. క్రికెటర్‌గా ఎంతో నేర్చుకున్నా. జీవితం గురించి మరింతగా తెలుసుకున్నా. నా సహచర ఆటగాళ్లందరికీ థాంక్స్! నాకు మద్దతుగా నిలిచిన సహాయక సిబ్బంది, వెంకీ సర్! మేనేజ్‌మెంట్‌లోని ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు" అంటూ టీమిండియా సీనియర్ ఆటగాడు, కోల్‌కత్ నైట్‌రైడర్స్ క్రికెటర్ అజింక్య రహానే ఉద్వేగానికి లోనయ్యాడు. వచ్చే ఏడాది నూతనోత్సాహంతో తిరిగి వస్తానని పేర్కొన్నాడు.కాగా ఐపీఎల్ మెగా వేలం-2022లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ అజింక్య రహానేను కోటి రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆడిన 7 మ్యాచ్‌లలో అతడు కేవలం 133 పరుగులు సాధించాడు. అయితే, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆదివారం నాటి మ్యాచ్ సందర్భంగా అతడు గాయపడిన విషయం తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**